# ఖుర్ఆన్ గమ్యపథం



Qur'an Gamyapatham
(Telugu)

# ఖుర్‌ఆన్ గమ్యపథం


రచన

ఖుర్రమ్ మురాద్

*(డిప్యూటీ డైరెక్టర్, ది ఇస్లామిక్ ఫౌండేషన్, లిసెస్టర్, యు.కె.)*

అనువాదం

అశోక్



TRUST

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

**Qur'an Gamyapatham (Telugu)**
**WAY TO THE QUR'AN**

**TIP Series No.** : **222**

Written by : Khurram Murad

Translated by : Ashok

*All Rights Reserved with Publishers*

Second Edition : March 2017

Copies : 1000

**Price** : **Rs.15**

ISBN : 81-88241-73-6

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# ఖుర్ఆన్ గమ్యపథం

అధ్యాయం-1

## ఓ కొత్త ప్రపంచం మీకై వేచివుంది

### ముఖ్య ప్రస్థానం

మీరిప్పుడు అతి ముఖ్యమైన ఓ ప్రస్థానం చేయబోతున్నారు. అది మిమ్మల్ని అపరిమితమైన ఆనందాలు, మనోహరమైన మాటల వైపుకి తీసుకెళుతుంది. వాటిని మీ సృష్టికర్త ప్రభువు మీకోసం, సర్వమానవాళి కోసం పంపించాడు. మీరు ఖుర్ఆన్ దగ్గరకు రాగానే మీముందు ఓ నూతన ప్రపంచం ప్రత్యక్షమవుతుంది. అది ఊహాతీతమైన అద్భుత విజ్ఞాన సంపదకు నిలయం. మీ ఆలోచనలకు పదునుపెట్టి, మీ జీవనపంథాను, మీ కార్యకలాపాలను సరైనగాడిలో పెట్టే మార్గదర్శి. అది మీ మనోభావాల్ని స్పర్శిస్తూ మీ హృదయ లోతులకు చేరి, మీ భావోద్వేగాలను కరిగించి కన్నీళ్ళ రూపంలో మీ చెక్కిళ్ళ మీదుగా ప్రవహింపజేసే దివ్యకాంతి. అదే ఖుర్ఆన్! అదే ఇహపర లోకాలలో మిమ్మల్ని విజయపథంలో నడిపించే కాంతిరథం.

### మానవ అవగాహనకు అతీతమైనది

దివ్యఖుర్ఆన్ ప్రాముఖ్యం, ఔన్నత్యాలు మానవ మేధకు అతీతమైన విషయాలు. అయినప్పటికీ ఖుర్ఆన్ ఎంత మహత్తరమైనదో మీకు కొంతైనా

తెలియాలి. మీరు పూర్తిగా తనలో మమేకం కావాలని, తనకు పూర్తిగా అంకితం కావాలని ఖుర్‌ఆన్ కోరుతోంది. దివ్యఖుర్‌ఆన్- అల్లాహ్ మీకు ప్రసాదించిన వరం. అది ఆదమ్ (అలైహి)కు, ఆదమ్ సంతతికి అల్లాహ్ చేసిన వాగ్దానం నెరవేర్చే పవిత్ర గంథం.

يَأْتِيَنَّكُم مِّنِّي هُدًى
فَمَن تَبِعَ هُدَايَ
فَلَا خَوْفٌ عَلَيْهِمْ
وَلَا هُمْ يَحْزَنُونَ ۝

...ఇకపై నా తరపు నుండి ఏదైనా ఉపదేశం మీ వద్దకు వచ్చినప్పుడు, నా ఈ ఉపదేశాన్ని అనుసరించే వారికి ఏ విధమైన భయంకానీ, విచారం కానీ కలిగే అవకాశం ఉండదు.

(దివ్యఖుర్‌ఆన్ -2:38)

## విజయానికి, పరలోక సాఫల్యానికి ఏకైక మార్గం

ఈ ప్రపంచంలో దుష్టశక్తులను, భయప్రలోభాలను ఎదుర్కోడంలో, మీ బలహీన ఉనికికి ఈ ఖుర్‌ఆన్ ఏకైక రక్షణ కవచంలా సాయపడుతుంది. అంధకారంలో కొట్టుమిట్టాడే మీకు ఏకైక కాంతి కిరణం ఇది.

భయంకరమైన జీవిత సాగరంలో మిమ్మల్ని సురక్షితంగా ఉంచగలిగే ఏకైక ఆశ్రయం ఇది. సప్తాకాశాల్లో ఎంతో శక్తిమంతుడు, విశ్వాసపాత్రుడు అయిన దేవదూత జిబ్రాయీల్ (అ) దీనిని ధరిత్రి మీదికి తీసుకొచ్చారు. అది మొట్టమొదట దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) పరిశుద్ధ హృదయంలో అవతరించింది. ఇంకా చెప్పాలంటే, అది మిమ్మల్ని మీ సృష్టికర్త సమీపానికి చేర్చే ఏకైక మార్గం. ఆయన గుణగణాలు, శక్తిసామర్థ్యాలు తెలుపుతుంది. ఆయనే యావత్తు విశ్వవ్యవస్థను నిర్వహిస్తున్నాడని, చరిత్రను సృష్టిస్తున్నాడని చెబుతుంది. సృష్టికర్తతో మీకు, మీతో సృష్టికర్తకు, తోటి మానవులకు, ఇతర సృష్టిరాసులకు ఉన్న సంబంధం ఏమిటో కూడా అది తెలియజేస్తుంది.

## అదసలు అల్లాహ్ వాణి

మీరు ఖుర్‌ఆన్‌లో చదివేదంతా సర్వలోక ప్రభువైన అల్లాహ్ వాణియే. ఆయన తన అపార దయ, దాతృత్వాల కారణంగా దాన్ని మానవ భాషలో మీ దగ్గరకు పంపాడు. ఆయనే మీ ప్రభువు, పోషకుడు. కనుక మీరు ఎల్లప్పుడూ ఆయనకు కృతజ్ఞులై ఉండాలని చెబుతోంది ఖుర్‌ఆన్.

لَوْ اَنْزَلْنَا هٰذَا الْقُرْاٰنَ عَلٰى جَبَلٍ لَّرَاَيْتَهٗ خَاشِعًا مُّتَصَدِّعًا مِّنْ خَشْيَةِ اللّٰهِ

ఒకవేళ మేము ఈ ఖుర్‌ఆన్‌ను ఏ పర్వతంపైనైనా అవతరింపజేస్తే, అది అల్లాహ్ భయంవల్ల క్రుంగిపోయి, బ్రద్దలై పోవటాన్ని నీవు చూస్తావు.
(దివ్యఖుర్‌ఆన్-59:21)

ఖుర్‌ఆన్‌ను మించిన అమూల్యమైన, విలువైన సంపద ఏదీ లేదు. అల్లాహ్ తన ఔదార్యం గురించి ఇలా తెలిపాడు:

يٰۤاَيُّهَا النَّاسُ قَدْ جَآءَتْكُمْ مَّوْعِظَةٌ مِّنْ رَّبِّكُمْ وَشِفَآءٌ لِّمَا فِى الصُّدُوْرِ ۙ وَهُدًى وَّرَحْمَةٌ لِّلْمُؤْمِنِيْنَ

మానవులారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి హితోపదేశం వచ్చేసింది. అది హృదయాల వ్యాధులకు స్వస్థత. దానిని స్వీకరించేవారికి అది మార్గ దర్శకత్వం, కారుణ్యం.
(దివ్యఖుర్‌ఆన్-10:57)

قُلْ بِفَضْلِ اللّٰهِ وَبِرَحْمَتِهٖ فَبِذٰلِكَ فَلْيَفْرَحُوْا هُوَ خَيْرٌ مِّمَّا يَجْمَعُوْنَ

ప్రవక్తా! ఇలా అను: 'అల్లాహ్ తన అనుగ్రహం వల్ల తన కారుణ్యం వల్ల దానిని పంపాడు. దానికి ప్రజలు సంబరపడాలి. ప్రజలు కూడబెట్టే వాటన్నిటికంటే అది ఉత్తమమైనది.'
(దివ్యఖుర్‌ఆన్-10:58)

## ఆయన కరుణాకటాక్షాలు, ఔదార్యం

అల్లాహ్ కరుణాకటాక్షాలు, ఔదర్యం కోసం మీరు సంబరపడండి. ఇవి ఖుర్ఆన్‌లోనే మీకగుపడుతాయి. అయితే నిబద్ధతతో, విధేయతతో తట్టే వారికే ఖుర్ఆన్ తలుపులు తెరుచుకుంటాయి. ఖుర్ఆన్ మార్గదర్శకత్వంలో నడిచే వారికి, దానికి పూర్తిగా అంకితమయ్యేవారికి మాత్రమే దాని ఫలసంపద లభిస్తుంది. ఒకవేళ మీరు ఖుర్ఆన్ వరకు వచ్చి రిక్తహస్తాలతో వెళితే - మీ ఆత్మను ఏది స్పృశించకుంటే, మీ హృదయం చలించకపోతే, మీ జీవితం మారకపోతే అది మీ దురదృష్టకరం అవుతుంది. 'వారు వచ్చినట్టే వచ్చి వెళ్ళారు' అన్నట్టు ఉండదా? మీరు ఖుర్ఆన్ వచనాలు పఠించవచ్చు, దాని పుటలు తిరిగేయవచ్చు, అయినా దాని భావసంపద మీకందకపోతే, మీరు పూర్తిగా పరివర్తన చెందకపోతే లాభమేమిటి? ఖుర్ఆన్ కటాక్షాలు అపరిమితం, కానీ అది ఏమేరకు మీకందుతున్నదన్నది మీ శక్తిసామర్థ్యాలపై, మీ అవగాహనపై ఆధారపడి ఉంటుంది. ఓ ద్రవ బిందువు తల్లి గర్భాశయాన్ని చేరి, అందులో తొమ్మిది నెలలు పరిణామంచెంది, వినగల, చూడగల, ఆలోచించగల వ్యక్తిగా మిమ్మల్ని రూపొందిస్తున్నప్పుడు, మీరు మీ జీవితాన్ని ఖుర్ఆన్‌తో గడిపితే ఏమవుతుందో ఊహించగలరా? ఖుర్ఆన్ గ్రంథాన్ని పొందడం, వినడం, చూడడం, యోచించడం, శ్రమించడం- ఇవి మీరు చేస్తారా?... అలా చేస్తే అది మీలో మార్పుతెచ్చి మిమ్మల్ని ఓ కొత్త వ్యక్తిగా రూపొందిస్తుంది. ఖుర్ఆన్‌కు అంకితవమై జీవించేవారి ముందు దేవదూతలు సైతం గర్వంగా మోకరిల్లు తారు. అందుకని ఖుర్ఆన్ మహత్యం ఏమిటో తెలుసుకుని దానికి మీరు అంకితం అవ్వండి. దివ్యఖుర్ఆన్ ఏమి చేయమని కోరు తుందో దానినే మీరు చేయండి. ఖుర్ఆన్‌ను సరయిన రీతిలో పఠించండి. దాని ద్వారా మీరు కూడా విశ్వాసుల్లో ఒకరిగా గణనకెక్కండి:

اَلَّذِيْنَ اٰتَيْنٰهُمُ الْكِتٰبَ يَتْلُوْنَهٗ حَقَّ تِلَاوَتِهٖ ؕ اُولٰٓئِكَ يُؤْمِنُوْنَ بِهٖ ؕ

మేము గ్రంథాన్ని ప్రసాదించిన వారు దానిని పఠించవలసిన విధంగా పఠిస్తారు. దానిని (ఖుర్ఆన్‌ను) వారు హృదయపూర్వకంగా విశ్వసిస్తారు.
**(దివ్యఖుర్ఆన్-2:121)**

# తిలావత్ లేక పారాయణం

ఖుర్‌ఆన్ పారాయణంలో మీరు పూర్తిగా లీనమయిపోవాలి. అంటే- మీ ఆత్మ, హృదయం, మెదడు, జిహ్వ, శరీరం సమస్తం ఆ పారాయణంలో పాల్గొనాలి. ఖుర్‌ఆన్ కోరే విధంగా, అంటే పఠించవలసిన విధంగా ఖుర్‌ఆన్ పఠించడం అంత సులభమైన విషయం కాదు. కానీ అలాగని కష్టమయినది, అసాధ్యమైనది అని కూడ తలచరాదు. ఒకవేళ అది కష్టమయినదే అయితే అది మీలాంటి కొత్త వారికోసం అర్థమైనదే కాదు, మార్గదర్శిగా, కటాక్షించేదిగా ఉండేదే కాదు. కానీ అది- మీ హృదయం, మనసు, అంతరాత్మ, శరీరం, తెలివితేటలు- అన్నిటినీ తనలో మమేకం చేయాలని కోరుతుంది. అంతేకాక కొన్ని షరతులు, విధులు నిర్వర్తించాలని కోరుతుంది. అవి ఆంతరంగికంగాను, బాహ్యంగాను ఉంటాయి. దివ్యఖుర్‌ఆన్ జగత్తులోకి ప్రవేశించే ముందు మీరవన్నీ ఏమిటో తెలుసుకోవాలి.

★★★

అధ్యాయం-2

# కనీస అవసరాలు

## మనోమస్తిష్క వైఖరులు

ఖుర్ఆన్ అధ్యయనం ఫలప్రదం కావాలంటే మీ మనోమస్తిష్కాలు, జిహ్వా, శరీరం అంతా ఖుర్ఆన్ పఠనంలో మమేకమైపోవాలి. కార్యాచరణలల్లో బలంగా సమైక్యతనొందాలి.

## 1. ప్రగాఢ విశ్వాసం

ఖుర్ఆన్ అల్లాహ్ దగ్గర్నుండి అవతరించిన దివ్యవాణి అన్న దృఢమైన నమ్మకంతో దాన్ని పఠించండి. ఖుర్ఆన్‌ని సాధారణ పుస్తకం చదివినట్లు చదివినా చదువరికి అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఖుర్ఆన్ దైవగ్రంథం! అయితే ఈ దైవగ్రంథాన్ని పఠిస్తున్నప్పుడు అందులోని ప్రతి పదం అల్లాహ్ నుంచి వచ్చిందన్న స్పృహ మీలో కలగాలి. ఈ స్పృహ మీలో సరైన ధోరణిని, దృఢసంకల్పాన్ని పెంపొందిస్తుంది. ఖుర్ఆన్ సందేశం మీ మనస్సుకు హత్తుకోవాలంటే ఈ గుణాలు తప్పనిసరి. అల్లాహ్ శక్తి, ఘనత, మహత్తును గురించి ఆలోచించినట్లయితే మీరాయన ఆరాధన, ఆయన హితవుల కోసం పరితపిస్తారు. ఈ సత్యాన్నే ఖుర్ఆన్ మీకు పదేపదే గుర్తు చేస్తుంది. సూరాల ఆరంభంలోనూ, మధ్యలోను ఇలా పదేపదే గుర్తుచేయడం మీరు గమనించవచ్చు.

## 2. పఠన ఉద్దేశం

ఖుర్ఆన్ పఠించడంలోని ముఖ్యోద్దేశం విశ్వప్రభువుకు దగ్గరకావడం, ఆయన మార్గదర్శకత్వాన్ని, ప్రసన్నతను పొందడం తప్ప మరేమీ కాదు. మీ సంపూర్ణ జీవితానికి ఖుర్ఆన్ నుంచి మార్గదర్శకత్వం పొందండి. అది కేవలం

ఖుర్ఆన్ నుంచే! ఖుర్ఆన్ అల్లాహ్ వచనం; ఆయన ఎలా ప్రత్యేకమైనవాడో అలాగే ఖుర్ఆన్ కూడా ప్రత్యేకమైనదే. ఖుర్ఆన్ మార్గదర్శకత్వంలో నడవక, ప్రాపంచిక కోరికలు తీర్చుకోవాలనుకునేవారు వాటిని పొందలేరు. కానీ అలా చేసే వ్యక్తి మొత్తం సముద్రంలో నుంచి ఓ కప్పు నీరు మాత్రమే తీసుకున్నట్లు అవుతుంది. ఎవరైనా తమ దగ్గర ఖుర్ఆన్ ఉన్నప్పటికీ మార్గదర్శనం కోసం ఇతరుల దగ్గరకు వెళ్తే, వారు నీటి కోసం ఎండమావుల వైపు పరుగెత్తినట్లే.

## 4. సత్యాన్ని, జ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని ఒప్పుకోండి

ఏ మాత్రమూ అనుమానం లేకుండా దివ్యఖుర్ఆన్ తెలిపే సత్యాన్ని, జ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని అంగీకరించండి. ఖుర్ఆన్‌లోని విషయాల్ని గురించి యోచించడానికి, పరిశీలించడానికి, అర్థంచేసుకోవడానికి మీకు పూర్తి హక్కులున్నాయి. అయితే సరైన అవగాహన లేకుండా, హేతురహితంగా దానిపై కువిమర్శలు చేయకూడదు. ఆ విధంగా ఖుర్ఆన్ దైవవాణి కాదని చెప్పడానికి ఎవరికీ హక్కు లేదు. ఒకసారి మీరు అది పూర్తిగా దైవవాణి అని అంగీకరించిన తరువాత, ఇక అందులోని ఒక్క పదాన్ని కూడా సందేహించకూడదు. ఖుర్ఆన్‌కు మీరు పూర్తిగా అంకితమైపోవాలి. మీ అభిప్రాయాలు, నమ్మకాలు, దృక్పథాలు ఏవీ ఖుర్ఆన్‌లోని ఎలాంటి భావస్రవంతినైనా అడ్డుకోకూడదు.

## 4. వైఖరి, ప్రవర్తనలను మార్చుకోవడానికి సిద్ధమవ్వాలి

మీరు దివ్యఖుర్ఆన్ బోధనలకు అనుగుణంగా మీ వైఖరి, ప్రవర్తనలను అంతర్గతంగాను, బాహ్యంగాను మార్చుకోవడానికి సిద్ధమవ్వాలి. మీరు తెలుసుకున్నది ఆచరణలో పెట్టేందుకు సిద్ధపడకపోతే ఖుర్ఆన్ వాస్తవిక జ్ఞానం దరిదాపులకి సయితం మీరు ఎన్నడూ చేరలేరు.

## 5. అల్లాహ్ ఆశ్రయం పొందండి

గుర్తుంచుకోండి. మీరు ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు, దాని భావామృతం ఆస్వాదిస్తున్నప్పుడు, మీకు మీ శ్రమఫలితం దక్కకుండా షైతాన్ ప్రయత్ని స్తాడు. మీ మనసును కలుషితం చేస్తాడు, ఖుర్ఆన్సందేశం ఏమిటో తెలియ కుండా మీ మనసులో అనేక అనుమానాలు రేకెత్తిస్తాడు. దైవవాణికి మీ మనస్సుకు మధ్య అనేక అడ్డంకులు సృష్టిస్తాడు. లేదా మీరు ఖుర్ఆన్ను అంగీకరించకుండా మిమ్మల్ని అనేక ప్రలోభాలకు గురిచేస్తాడు. ఇలాంటి అడ్డంకుల్ని లెక్కచేయకుండా మీరు మనస్ఫూర్తిగా, భయభక్తులతో అవూజు బిల్లాహి మినష్షైతా నిర్రజీమ్' అని పలికి ఖుర్ఆన్ పఠనం మొదలెట్టండి

فَإِذَا قَرَأْتَ الْقُرْآنَ
فَاسْتَعِذْ بِاللَّهِ
مِنَ الشَّيْطَانِ الرَّجِيمِ

మీరు ఖుర్ఆన్ పఠనం ప్రారంభించి నప్పుడు శాపగ్రస్తుడైన షైతాను బారి నుండి అల్లాహ్ శరణు కోరుకొనండి.
(దివ్యఖుర్ఆన్-16:98)

## 6. అపారమైన అల్లాహ్ కృప

అల్లాహ్ అపార కృప కారణంగా ఆయనవాణి ఖుర్ఆన్ రూపంలో మీ వద్దకు వచ్చింది. ఆయన దయతోనే మీరు ముందుకు సాగుతారు. దివ్య ఖుర్ఆన్ పఠించి సాఫల్యం పొందుతారు. అందుకు మీ కృషి, తపన ఎంతో అవసరం. కానీ దైవసంకల్పం, సహాయంతోనే మీరు సాఫల్యం పొందగలరు. ఆయన మీద భారంవేసి, ఆయన్నే నమ్మి, ఆయననే ఆరాధిస్తూ వినయ విధేయతలతో దివ్యఖుర్ఆన్ వైపుకు అడుగేయండి.

## 7. నిరంతర స్తోత్రాలు, కృతజ్ఞతలు

తన అమూల్య కానుక దివ్యఖుర్ఆన్ను మీకు ప్రసాదించినందుకు గాను, దానిని పఠించేందుకు, అధ్యయనం చేసేందుకు మీకు మార్గనిర్దేశన చేసిన ఆ ప్రభువుకు మీరు ఎల్లవేళలా కృతజ్ఞతలు, స్తోత్రములు తెలుపండి.

మాకు ఈ మార్గం చూపిన అల్లాహ్‌కే స్తోత్రాలు. ఆయనే గనక మాకు మార్గం చూపి ఉండకపోయినట్లయితే స్వయంగా మేము మార్గం పొంది ఉండేవారం కాదు.

(దివ్యఖుర్ఆన్-7:43)

الْحَمْدُ لِلّٰهِ
الَّذِىْ هَدٰىنَا لِهٰذَا
وَمَا كُنَّا لِنَهْتَدِىَ
لَوْلَآ اَنْ هَدٰىنَا اللّٰهُ

మీరెంతగా కృతజ్ఞులై ఉంటే అంతే ఘనంగా అల్లాహ్ దివ్యఖుర్ఆన్ సత్ఫలితాలను మీకందిస్తాడు.

ఆయననే నమ్మి, ఆయనపైనే భారంవేసి ప్రశంసలు, కృతజ్ఞతలు ఆయనకే తెలుపుతూ మీ హృదయం, నాలుక పరస్పరం సామరస్యంగా ఇలా స్మరించాలి: 'అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో....' - ఈ వాక్యం దివ్యఖుర్ఆన్‌లోని 114 సూరాలలో కేవలం ఒక్క సూరాలో తప్ప మిగిలిన ప్రతి సూరాలోను దర్శనమిస్తుంది. ఇంకా ఇలా ప్రార్థించండి:

ప్రభూ! నీవు మాకు సరియైన మార్గాన్ని చూపావు. ఇక మా మనస్సులను వక్ర మార్గం వైపునకు మళ్ళించకు. నీ కారుణ్య నిధి నుండి మాకు కారుణ్యాన్ని ప్రసాదించు. నిజమైన దాతవు నీవే. (దివ్యఖుర్ఆన్-3:8)

رَبَّنَا لَا تُزِغْ قُلُوْبَنَا
بَعْدَ اِذْ هَدَيْتَنَا
وَهَبْ لَنَا
مِنْ لَّدُنْكَ رَحْمَةً
اِنَّكَ اَنْتَ الْوَهَّابُ

★★★

అధ్యాయం-3

# మనసును లగ్నపరచండి

## మీ మనసు మీతోనే ఉండాలి

మీరు దివ్యఖుర్‌ఆన్ పఠించేటప్పుడు మీ మనసు మీతోనే ఉండాలి. శరీరం ఇక్కడే ఉంది కాని మనస్సు ఎక్కడో ఉందన్నట్టు ఉండరాదు. మీ ధ్యానం, జ్ఞాపకం, ఉద్వేగాలు, వాంఛలు, కార్యాలు సమస్తాన్నీ మీరు ఖుర్‌ఆన్ పఠనంపైనే లగ్నం చేయాలి. అప్పుడే మీకు అల్లాహ్ ప్రసాదించే గొప్ప కానుకలు అందుతాయి. అందుకు మీరు భక్తిశ్రద్ధలతో పఠించాలి. మీ హృదయం ఖుర్‌ఆన్‌లో లగ్నం కావాలంటే ఇదివరకే వివరించినట్లు ఏడు అర్హతలు మీలో ఉండాలి. దీనికితోడు మరికొన్ని నియమాలు మీరు పాటిస్తే మరింత శ్రద్ధతో మీ మనస్సు ఖుర్‌ఆన్ పఠనంలో లీనమయిపోతుంది.

## ఎ) అల్లాహ్ సమక్షంలో

మీరు దివ్యఖుర్‌ఆన్ పఠించేటప్పుడు ఒక విషయం గుర్తుంచుకోండి. అది, మీరు అల్లాహ్ సమక్షంలో ఉన్నారని, ఆయన పంపిన వచనాలనే మీరు పఠిస్తున్నారని.

وَهُوَ مَعَكُمْ أَيْنَ مَا كُنْتُمْ

మీరు ఎక్కడ ఉన్నా ఆయన మీతో ఉన్నాడు. (దివ్యఖుర్‌ఆన్-57:4)

وَنَحْنُ أَقْرَبُ إِلَيْهِ مِنْ حَبْلِ الْوَرِيدِ ۝

మేము అతని కంఠ రక్తనాళం కంటే కూడా అతనికి చాలా దగ్గరగా ఉన్నాము. (దివ్యఖుర్‌ఆన్-50:16)

وَمَا تَتْلُوا مِنْهُ مِنْ قُرْاٰنٍ وَّلَا تَعْمَلُوْنَ مِنْ عَمَلٍ اِلَّا كُنَّا عَلَيْكُمْ شُهُوْدًا اِذْ تُفِيْضُوْنَ فِيْهِ

ఖుర్ఆన్ నుంచి దేనిని వినిపించినా, మానవులారా! మీరు ఏది చేసినా, ఆ అన్ని సందర్భాలలోనూ . మేము మిమ్మల్ని చూస్తూనే ఉంటాము.
(దివ్యఖుర్ఆన్-10:61)

فَاذْكُرُوْنِيْٓ اَذْكُرْكُمْ

మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకోండి. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకుంటాను.
(దివ్యఖుర్ఆన్-2:152)

## బి) అల్లాహ్ నుంచే ఖుర్ఆన్ విన్నట్లుండాలి

దివ్యఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు అల్లాహ్ సమక్షంలో ఉన్నట్లు, ఆయన నుంచే దివ్యఖుర్ఆన్ వింటున్నట్లు అనుభూతి చెందండి. ఎవరయితే దివ్య ఖుర్ఆన్‌కు దగ్గరవుతారో వారే దాని మాధుర్యాన్ని చవిచూస్తారు. మొదట దానిని ప్రవక్త (స) నుంచి వింటున్నట్టు అనుభూతి చెందుతారు. తరువాత దానిని దేవదూత జిబ్రాయీల్ నుంచి వింటున్నట్టు, చివరగా అల్లాహ్ నుంచే వింటున్నట్లు అనుభూతి చెందుతారని ఇమామ్ గజాలీ తన గ్రంథం ఇహ్యా ఉల్ ఉలూమ్‌లో తెలిపారు.

## సి) ఖుర్ఆన్ ప్రత్యక్ష శ్రోత మీరే అనుకోండి

మిమ్మల్ని మీరు వ్యక్తిగతంగా ఖుర్ఆన్ ప్రత్యక్ష శ్రోతగా భావించుకోండి. మీకు అందిన ఖుర్ఆన్ గ్రంథం ఇతరుల ద్వారా, ఏదో ఒక సమయంలో, ఎక్కడో ఒకచోట అందినప్పటికీ అవన్నీ మరచిపోయి, అది మీకు నేరుగా అందిందని భావించండి. ఖుర్ఆన్ మిమ్మల్నే ప్రత్యక్షంగా సంబోధించి బోధిస్తున్న శైలిలో ఉంటుంది. అది మీ మనోమస్తిష్కాలలోకి చొచ్చుకుపోతుంది. మీకా దివ్యగ్రంథం అందిందన్న భావం, దానిని పఠించడం వల్ల మీ మనస్సు దానికి హత్తుకుపోతుంది.

## డి) మీ స్థితి ఆంతరంగిక అణకువను ప్రతిబింబించాలి

మీ బాహ్య స్థితి, అంతరంగాన్ని ప్రతిబింబించాలి. దైవ వచనానికి మర్యాద, ఆరాధన భావం, విధేయత ఇవ్వండి. మనిషి బాహ్య స్థితికి, ఆంతరంగిక స్థితికి లోతైన సంబంధం ఉంది. శరీరం అదుపులో ఉంటే మనస్సును అది అదుపులో ఉంచుతుంది. సాధారణ పుస్తకం చదివే దానికంటే భిన్నమైన స్థితి మీరు దివ్యఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు ఉండాలి.

## ఇ) పరిశుద్ధంగా ఉండండి

మీరు పరిశుద్ధంగా ఉండండి. పరిశుద్ధులే దివ్యఖుర్‌ఆన్ ముట్టుకోడానికి అర్హులు. మీ దుస్తులు, మీరున్న ప్రదేశం, మీ శరీరం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోండి. మీ ఆకాంక్షలు కూడా పరిశుద్ధంగా ఉండేలా చూసుకోండి. అన్ని పాపాలకు దూరంగా మీ మనసు, శరీరం పవిత్రంగా ఉండడం కూడా ముఖ్యమే. పాపం అంటూ చేయని వారెవరు లేరు. అయినప్పటికీ మీరు వీలయినంత వరకు ఎలాంటి పాపం చేయకుండా ఉండండి. ఒకవేళ మీరు పొరపాటున ఏదైనా పాపం చేసినట్లయితే పాశ్చాత్తాపంతో అల్లాహ్ వైపు మరలండి. వీలయినంత త్వరగా ఆయన క్షమాపణ కోరండి. మీరు దివ్య ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు మీరు ఎలాంటి నిషిద్ధాలు (హరామ్) భుజించరాదు, ధరించరాదు, అలాగే అల్లాహ్ అనుమతించని పద్ధతిలో జీవించరాదు. మీరెంత పవిత్రంగా ఉంటే, మీ మనస్సు అదే స్థాయిలో మీతో ఉంటుంది. ఖుర్‌ఆన్ పఠనంలో మీ మనస్సు అంతే స్వచ్ఛంగా నిమగ్నమవుతుంది. దాని బోధనలను ఆస్వాదిస్తుంది.

★★★

అధ్యాయం-4

# అర్థం చేసుకోవాలి, ప్రతిబింబించాలి

అల్లాహ్ ఏమి చెప్పారో అది మీకు అర్థం కావాలి. పైగా అది మీలో ప్రతిబింబించాలి. మీరు అర్థం చేసుకోకుండా దివ్యఖుర్‌ఆన్ చదివినా కూడా మీకు మేలు జరుగుతుంది. ఎందుకంటే మీలో ఆరాధన భావం ఏర్పడటం, దైవగ్రంథాన్ని చదవాలన్న కోరిక కలగటం వల్ల ఆ మేలు మీకు కలుగుతుంది. అయితే ఇలా అర్థం చేసుకోకుండా చదవడం వల్ల పూర్తి ఫలితం దక్కదు. మిమ్మల్ని బలపర్చడానికి, మిమ్మల్ని మార్చడానికి, ఓ కొత్త జీవితంలోకి మిమ్మల్ని తీసుకెళ్ళడానికి దివ్యఖుర్‌ఆన్ వచ్చింది. అది కేవలం ఓ పవిత్ర గ్రంథం, ఆచారం, వరము, మహత్యం మాత్రమే కాదు. దివ్యఖుర్‌ఆన్ పూర్తి బోధనలతో కూడుకున్నది. మిమ్మల్ని అది "వినలేరా, చూడలేరా, ఆలోచించలేరా, హేతువును ఉపయోగించరా, యోచించరా" అని అడుగుతుంది. ఇంకా ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

وَالَّذِيْنَ اِذَا ذُكِّرُوْا بِاٰيٰتِ رَبِّهِمْ لَمْ يَخِرُّوْا عَلَيْهَا صُمًّا وَّعُمْيَانًا ۝

వారికి తమ ప్రభువు ఆయతులను వినిపించి హితబోధ చేయటం జరిగితే, వారు దానిని గురించి అంధులుగా, చెవిటివారుగా ఉండిపోరు.
(దివ్యఖుర్‌ఆన్-25:73)

اَفَلَا يَتَدَبَّرُوْنَ الْقُرْاٰنَ اَمْ عَلٰى قُلُوْبٍ اَقْفَالُهَا ۝

వారు ఖుర్‌ఆన్‌ను గురించి ఆలోచించలేదా? లేక వారి హృదయాలకు తాళాలు పడివున్నాయా?
(దివ్యఖుర్‌ఆన్-47:24)

ఖుర్ఆన్ గురించి ఆలోచించడానికి, అర్థం చేసుకోడానికి ఇతరత్రా మార్గదర్శకాలని మీరు పొందవచ్చు. కానీ కొన్ని సిద్ధాంతాలను మీరు మనసులో ఉంచుకోవాలి.

1. ఖుర్ఆన్‌ను అర్థంచేసుకోండి. ఈనాడే అది అతరించినట్లు ప్రతి స్పందించండి. అది ఆనాడు అవతరించినప్పుడు ఎలా ఆ కాలానికి అనుగుణంగా ఉండేదో, అలాగే నేటి పరిస్థితులకు అనుకూలంగా ఉందని భావించండి. ఈవిధంగా దానిని మీ జీవితానికి, అవసరాలకు, అనుభవాలకు, విజ్ఞానానికి, సాంకేతిక రంగాలకు అన్వయించండి. ఖుర్ఆన్‌లోని ఏ ఆయతును గత కాలపు మాటలుగా తీసేయకండి.
2. దివ్యఖుర్ఆన్‌ను ఆద్యంతం, అనువాదం సాయంతో చదవండి,. దాని వల్ల మీకు మొత్తం గ్రంథం భావం, శైలి, సందేశం అర్థమవుతాయి.
3. మొదట చిన్న చిన్న వ్యాఖ్యానాలు చదవండి. పెద్ద పెద్ద వ్యాఖ్యానాల జోలికి వెళ్ళకండి.
4. వీలయినంత వరకు అరబీ నేర్చుకోండి. అనువాదం సాయం లేకుండా ఖుర్ఆన్‌ను అర్థం చేసుకోవడానికి అది ఉపయోగపడుతుంది. ఖుర్ఆన్ పఠించడం చాలా శ్రమతో కూడిన వ్యవహారంగా మీకు అనిపించవచ్చు. కానీ అతి తక్కువ చదువుసంధ్యలు ఉన్నవారు సయితం నిష్ఠతో, నిబద్ధతో కొన్ని రోజులలోనే ఖుర్ఆన్‌ను క్షుణ్ణంగా పఠించడం నేను చూశాను.
5. మీరు ఏయే భాగాలు చదివారో, వాటిపైన లోతుగా ఆలోచించండి. ఓ ప్రత్యేక ఆయతును పఠించడానికి, లేదా ఒక భాగాన్ని మెల్లగా చదవడానికి, మళ్ళీమళ్ళీ చదవడానికి ఇది ఉపయోగపడుతుంది. మీరెంతగా చదివి స్పందిస్తే అంతే స్థాయిలో మీకు ఖుర్ఆన్ సౌభాగ్యాలు దక్కుతాయి. దాని అపరిమిత అర్థాలు తెలుస్తాయి. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. అదేమిటంటే సూరా అల్ బఖరాను ఇబ్నెఉమర్ ఎనిమిదేళ్ళపాటు చదివారు. ప్రవక్త (స), ఇతరులు ఒక్క ఆయతునే అనేక రాత్రులు చదివారు.

అధ్యాయం-5

# ఆంతరంగిక అనుభవం

దివ్యఖుర్ఆన్ మొదట దైవప్రవక్త (స) హృదయంలోకి పంపబడింది. కనుక మీరు కూడా ఖుర్ఆన్ పఠించేటప్పుడు మీ హృదయాన్ని లగ్నం చేస్తే పరమానందాలను మీరు పొందగలరు. ఒకవేళ మీరు అల్లాహ్ వచనాలను ఆయన సమక్షంలో పఠిస్తున్నట్లు భావిస్తే, ఒకవేళ దానిని అర్థం చేసుకొని, స్పందిస్తే ఆ ఆనందాలు మీరూ పొందడం కష్టమేమి కాదు. అలాంటి నిష్ఠ, నిబద్ధతలను ఇతర మార్గాల ద్వారా కూడా మీరు సాధించ వచ్చు.

## 1. హృదయపూర్వకంగా ఖుర్ఆన్ స్వీకరించడం

హృదయపూర్వకంగా దివ్యఖుర్ఆన్ స్వీకరించిన వారికి అది ఏమి చెబుతుందో మీరు గుర్తుంచుకోండి. ప్రవక్త (స), ఆయన సహచరులు, ఇతరులు ఏ విధంగా ఖుర్ఆన్ పఠనంలో లీనమయ్యేవారో గుర్తుంచుకోండి.

وَإِذَا سَمِعُوا مَا أُنْزِلَ إِلَى الرَّسُولِ
تَرَىٰ أَعْيُنَهُمْ تَفِيضُ مِنَ الدَّمْعِ
مِمَّا عَرَفُوا مِنَ الْحَقِّ
يَقُولُونَ رَبَّنَا آمَنَّا
فَاكْتُبْنَا مَعَ الشَّاهِدِينَ ○

ప్రవక్తపై అవతరించిన ఈ గ్రంథాన్ని వారు విన్నప్పుడు, సత్యాన్ని గ్రహించిన కారణంగా వారి కళ్ళు అశ్రువులతో చెమ్మగిల్లటం నీవు చూస్తావు. వారు ఇలా అనేస్తారు: 'ప్రభూ! మేము విశ్వసించాము. మా పేర్లను సాక్ష్యం ఇచ్చే వారిలో వ్రాయి.'(దివ్యఖుర్ఆన్-5:86)

## 2. వ్యక్తిగతంగా పరిగణించండి

మీరు ఇప్పటికే దివ్యఖుర్‌ఆన్ స్వీకరించడానికి సిద్ధమయ్యారు. అల్లాహ్ బోధనలతో కూడిన దివ్యఖుర్‌ఆన్ మీ ప్రస్తుత జీవన కాలంలోనూ అనువైనదే. ప్రతి ఆయతులోని సందేశం మీ కోసమే అన్నట్లు భావించండి. అది సాధారణమైనది, విలువైనది, ఓ ప్రకటన, విజ్ఞాన విషయం, వాగ్దానం, హెచ్చరిక, ఆజ్ఞ, నిషేధం- ఇలా ఏ రూపంలోనిదైనా కావచ్చు.

## 3. మనఃపూర్వకమైన ప్రత్యుత్తరము

వివిధ ఆయతులలో ఉన్న వివిధ వ్యాఖ్యానాలు, ప్రసంగాలు మీ హృదయానికి హత్తుకుపోవాలి. మీరు ప్రతిస్పందించాలి. అర్చన, ప్రశంస, భయం, ఆశ్చర్యం, ఆశ, నిరాశ, అభయం, వ్యాకులం, ప్రేమ, భీతి, ఆనందం, దుఃఖం, భక్తి, దాసోహం వంటి వివిధ స్థితిగతులను మీరు అధిగమించాలి.

## 4. మనఃపూర్వకంగా కృతజ్ఞత తెలపాలి

ఈ మీ మనోస్థితులను మీ నోటి ద్వారా తెలపాలి. అందుకే ప్రవక్త (స) తన రాత్రిపూట ప్రార్థనల్లో దివ్యఖుర్‌ఆన్ పఠించేవారు. అల్లాహ్ గొప్పతనం, ఘనతను తెలిపే ఆయతులను చదివాక ఆయన 'సుబ్‌హానల్లాహ్' అనే వారు. అల్లాహ్ కరుణాకటాక్షాలు తెలిపే ఆయతులు చదివాక 'అల్‌హమ్దులిల్లాహ్' అనేవారు. అమూల్యమైన అల్లాహ్ ప్రసంగాల ఆయతులు చదివాక శరణు ఇమ్మని, క్షమించమని ఆయన అల్లాహ్‌ను వేడుకునేవారు.

## 5. మనఃపూర్వకంగా నిమగ్నం అవ్వండి

మీరు మనఃపూర్వకంగా నిమగ్నమైనట్లు మీ కళ్ళు పొంగిపొర్లాలి. ప్రవక్త (స), ఆయన సహచరులు, ఇతరులు దివ్యఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు అందు లోని సత్యాన్ని గ్రహించి దుఃఖించేవారు. మీరు కూడా ఖుర్‌ఆన్ మీకిచ్చే హెచ్చరికలు, బరువైన బాధ్యతలను గురించి ఆలోచించి దుఃఖించవచ్చు.

అధ్యాయం-6

# ఖుర్‌ఆన్ ప్రకారం జీవించడం

దివ్యఖుర్‌ఆన్ ముఖ్యోద్దేశం మీకు మార్గదర్శన చేయడం, మిమ్మల్ని మార్చడం, మిమ్మల్ని అల్లాహ్ దాస్యం వైపుకు తీసుకెళ్ళడం. మీరు ఖుర్‌ఆన్ పఠించాక, దాని ప్రకారం జీవించమని ఆ దైవగ్రంథం కోరుతుంది. మీ ఆచరణలపై ఖుర్‌ఆన్ ప్రభావం ఏమాత్రమూ లేకపోతే, అది ఆదేశించినవి, నిషేధించినవి మీరు పాటించకపోతే మీరు ఖుర్‌ఆన్‌కు చేరువ కాలేదనే లెక్క. వాస్తవానికి ఎవరైతే దివ్యఖుర్‌ఆన్ చదివి కూడా దాని ప్రకారం జీవించనట్లయితే వారు అల్లాహ్ అభిశాపానికి, శిక్షకు గురవుతారు. ప్రవక్త (స) ఇలా తెలిపారు: "నా ఉమ్మత్ (సమాజం)లోని చాలా మంది కపటులు దైవగ్రంథం పఠించేవారై ఉన్నారు." (అహ్మద్)

"హరామ్‌ని (నిషిద్ధాన్ని) హలాల్‌గా (ధర్మసమ్మతంగా) చేసుకునేవారు ఖుర్‌ఆన్‌ని విశ్వసించిన వారు కాజాలరు." (తిర్మిజి)

ఇలా ఓ కథనం ఉంది: ప్రవక్త (స) సహచరులైన ఉస్మాన్ (రజి), అబ్దుల్లాహ్ ఇబ్నె మసూద్ (రజి) ఒకానొకప్పుడు ప్రవక్త(స)గారి నుంచి పది ఆయతులు నేర్చుకున్నారు, అయితే వాటిని పూర్తిగా నేర్చుకునే వరకు ముందుకు సాగలేదు. అంటే అర్థం చేసుకోవడంలోనూ, ఆచరించడంలోనూ పరిపూర్ణత సాధించేవరకు; అలా కొన్ని సందర్భాలలో వారు ఒక్క సూరా నేర్చుకోవడానికి సయితం సంవత్సరాలు గడిపేసేవారు.

ఒకవేళ మీరు ఖుర్‌ఆన్ ప్రకారం జీవించడానికి మారాలని మనఃపూర్వకంగా కోరుకుంటే, దృఢచిత్తంతో ఉంటే, అల్లాహ్ తప్పకుండా మీ మార్గం సుగమమయ్యేలా సహాయపడతాడు.

అధ్యాయం-7

# పఠించడం

దివ్యఖుర్ఆన్ పఠించేటప్పుడు మీరు మనసులో ఉంచుకోవలసిన మరికొన్ని విధులు ఉన్నాయి.

## 1. ప్రతిరోజు చదవాలి

ప్రతిరోజూ ఖుర్ఆన్ పఠించండి; అది పఠించకుండా ఏ రోజూ ముగించకండి. ఎప్పుడో ఒకప్పుడు దైవగ్రంథంలోని పెద్ద భాగాన్ని చదివేకంటే రోజూ ఓ చిన్న భాగం చదవడం మంచిది.

## 2. కంఠస్థం చేయండి

వీలయినంత వరకు ఖుర్ఆన్‌ను కంఠస్థం చేయండి. మొదట చిన్న సూరాలు, ప్రకరణలు కంఠస్థం చేయడం మొదలెట్టండి. తరువాత పెద్ద భాగాలు కంఠస్థం చేయడం మొదలెట్టండి.

## 3. ప్రార్థనలో ఖుర్ఆన్ పఠించండి

ప్రార్థనల్లో వీలయినంత వరకు ఖుర్ఆన్ పఠించండి. ముఖ్యంగా రాత్రిపూట, 'ఇషా' తరువాత, 'ఫజర్'కు ముందు, 'ఫజర్'లోను పఠించండి. ఆ సమయం చాలా ప్రశాంతంగా ఉంటుంది. కనుక ఆ సమయంలో పఠించినంత బాగా ఇతర సమయంలో పఠించలేము.

## 4. శ్రావ్య స్వరం

ఖుర్ఆన్‌ను మధురంగా పఠించండి, మనకు చెప్పినట్లు: 'ఖుర్ఆన్‌కు మీ మధుర స్వరంతో వన్నె తీసుకురండి.' అయితే ఒకటి గుర్తుంచుకోండి-

'ఖుర్ఆన్ పఠనంలో ఎవరైతే తమ కంఠస్వరంలో అల్లాహ్ పట్ల భయభక్తులు ప్రతిఫలింపజేస్తారో వారే ఖుర్ఆన్ను చక్కగా పఠించేవారు!

## 5. మనసు లగ్నం చేసి పఠించండి, అర్థం చేసుకోండి

మనసును సరిగ్గా లగ్నం చేయకుండా, అర్థం చేసుకోకుండా వేగంగా చదవకండి. 'వారం రోజులలో ఖుర్ఆన్ పఠించడం ముగించొద్దని, ఎవరయితే మూడు రోజులలో ఖుర్ఆన్ గ్రంథాన్ని చదివేస్తారో వారు దానిని అర్థం చేసుకోలేరని' ప్రవక్త (స)గారు ఇబ్నెఉమర్తో అన్నారు. ఆయన సహచరు డొకరు తాను పెద్ద సూరాలయిన అల్బఖర, ఆలి ఇమ్రాన్ వంటివి వేగిరంగా చదివేకంటే, అల్ఖారిఅ వంటి చిన్న సూరాను అర్థం చేసుకుంటూ, నిదానంగా పఠించడానికి ఇష్టపడతానని అన్నారు.

★★★

అధ్యాయం-8

# ప్రవక్త (స) జీవితం

మీరు ఖుర్ఆన్‌కు ఆకర్షితులవ్వాలంటే మీరు ప్రవక్త (స) పట్ల ఆకర్షితులు కావాలి. ఎందుకంటే అల్లాహ్ నుంచి దైవగ్రంథం మొదట పొందింది ఆయనే కనుక. ఆయన సమస్త జీవితం 'ఖుర్ఆన్ జీవం'. దివ్య ఖుర్ఆన్‌ను మీరు ఆచరణాత్మకంగా చదవాలనుకుంటే ప్రవక్త (స)గారి ఆచరణలు తెలుసుకోండి. 'ఆయన శీలం -ఖుర్ఆన్ తప్ప మరొకటి కాదు' అని సయ్యిదా ఆయిషా (రజిఅన్హా) తెలిపారు. ప్రవక్త (స) సామీప్యతను పొందాలంటే మీరు ఆయన బోధనలు (హదీసులు), ఆయన జీవితచరిత్ర (సీరత్)ను వీలయినంత ఎక్కువ చదవాలి.

చివరగా, ఖుర్ఆన్ గ్రంథాన్ని ఏ రీతిలో పఠించాలో ఆ రీతిలో పఠించేలా చూడమని అల్లాహ్‌ని ప్రార్థిద్దాం. ఇంకా ఈ క్రిందివి చేయనీయకుండా చూడమని కోరుకుందాం:

كَالَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ مِنْ قَبْلُ فَطَالَ عَلَيْهِمُ الْاَمَدُ فَقَسَتْ قُلُوْبُهُمْ ۥ

పూర్వం గ్రంథం ఇవ్వబడిన ప్రజల మాదిరిగా వారు మారిపోకూడదు. ఒక సుదీర్ఘకాలం వారిపై గడచిపోయింది. అప్పుడు వారి హృదయాలు కఠిన మయ్యాయి. (దివ్యఖుర్ఆన్-57:16)

الَّذِيْنَ حُمِّلُوا التَّوْرٰىةَ ثُمَّ لَمْ يَحْمِلُوْهَا كَمَثَلِ الْحِمَارِ يَحْمِلُ اَسْفَارًا ۥ

తౌరాత్ గ్రంథ బాధ్యతా భారం మోప బడినప్పటికీ, దానిని మోయనివారు, పుస్తకాల బరువును మోసే గాడిదను పోలి ఉన్నారు. (దివ్యఖుర్ఆన్-62:5)

... అల్లాహ్ ప్రస్తావన విన్నంతనే వారి హృదయాలు భయంతో కంపిస్తాయి. వారి సమ క్షంలో అల్లాహ్ ఆయతులు పారాయణం చెయ్యబడినప్పుడు వారి విశ్వాసం పెరుగుతుంది.

(దివ్యఖుర్ఆన్-8:2)

إِذَا ذُكِرَ اللّٰهُ وَجِلَتْ قُلُوْبُهُمْ
وَإِذَا تُلِيَتْ عَلَيْهِمْ
اٰيٰتُهٗ زَادَتْهُمْ اِيْمَانًا

తమ ప్రభువునకు భయపడేవారి రోమాలు నిక్కబొడుచుకుంటాయి; తరువాత వారి శరీరాలూ, వారి హృదయాలూ మెత్తబడి అల్లాహ్ ధ్యానం వైపునకు మొగ్గుతాయి.

(ఖుర్ఆన్-39:23)

تَقْشَعِرُّ مِنْهُ جُلُوْدُ الَّذِيْنَ
يَخْشَوْنَ رَبَّهُمْ ثُمَّ تَلِيْنُ جُلُوْدُهُمْ
وَقُلُوْبُهُمْ اِلٰى ذِكْرِ اللّٰهِ

ఇది వరకు జ్ఞానం ఇవ్వబడిన వారికి దానిని వినిపించినప్పుడు వారు ముఖాన్ని నేలకు ఆనించి సాష్టాంగపడి ముక్త కంఠంతో ఇలా అంటారు: "మా ప్రభువు పరిశుద్ధుడు, ఆయన వాగ్దానం పూర్తయి తీరవలసిందే." వారు ముఖాన్ని నేలకు ఆనించి విలపిస్తూ పడిపోతారు. దానిని విన్న తరువాత వారి అణకువ మరింత పెరుగుతుంది. (దివ్యఖుర్ఆన్-17:107-109)

اِذَا يُتْلٰى عَلَيْهِمْ
يَخِرُّوْنَ لِلْاَذْقَانِ سُجَّدًا ۙ
وَّيَقُوْلُوْنَ سُبْحٰنَ رَبِّنَآ
اِنْ كَانَ وَعْدُ رَبِّنَا لَمَفْعُوْلًا
وَيَخِرُّوْنَ لِلْاَذْقَانِ
يَبْكُوْنَ وَيَزِيْدُهُمْ خُشُوْعًا

వారి గురించి ప్రవక్త (స) తీర్పుదినాన ఇలా అంటాడు:

"నా ప్రభూ! నా జాతివారు ఈ ఖుర్ఆన్‌ను ఒక పరిహాస విషయంగా చేసుకున్నారు." (దివ్యఖుర్ఆన్-25:30)

يٰرَبِّ اِنَّ قَوْمِي
اتَّخَذُوْا هٰذَا الْقُرْاٰنَ مَهْجُوْرًا

మన ప్రభువు! మనకు ఖుర్ఆన్ అర్థం అయ్యేలా చేసి మనల్ని రుజు మార్గంపై నడిపిస్తాడు.

## ఖుర్ఆన్ గురించి ఇతరులు చెప్పింది....

ఇది మీకు మీరే ఇచ్చుకోవలసిన పుస్తకం. మీకు ప్రాథమిక జ్ఞానాన్ని అందించే పుస్తకమిది. ముస్లిమేతరులు ఎంతగానో ప్రశంసించినది. నేడు లక్షలాది మందికి జీవనమార్గం చూపే గ్రంథం ఇది.

## మధుర సంగీతం

"ఎప్పుడైనా నేను ఖుర్ఆన్ పఠనం విన్నప్పుడు నాకు సంగీతం వింటున్నట్లు అనిపిస్తుంది. దానిలో మిళితమై వినిపించే శ్రావ్యత నాకు మృదంగ నాదంలా వినిపిస్తుంది. అది నా హృదయ స్పందనలా ఉంటుంది."

-ఎ.జె. అర్‌బెర్రీ *(ఖుర్ఆన్ అనువదించిన క్రైస్తవ ఆంగ్లేయుడు)*

## అద్భుతమైనది

"...ఓ కావ్యం, న్యాయగ్రంథం, ప్రార్థన పుస్తకం, బైబిలు వంటివన్నీ ఒకటిగా కలబోసినట్లున్న గ్రంథం ఇది. మొత్తం ప్రపంచ జనాభాలో ఆరవ వంతు మంది సత్యమైనది, విజ్ఞానదాయకమైనది, శైలిలోను, స్వచ్ఛతలోను అద్భుతమైనది అని నమ్ముతున్నారు. ముహమ్మద్ (స) ఈ గ్రంథాన్ని అద్భుతమైనది అన్నారు. ఇప్పటికీ అద్భుత గ్రంథంగా ఉంది. ఆయన దీనిని అద్భుత మన్నప్పటికీ, నిజానికి అద్భుతమైనదే!"

-రివరెండ్ ఆర్. బాస్‌వర్త్ స్మిత్

**తిరస్కరించిన వారు ఈ విషయాలను గురించి ఆలోచించరా; ఆకాశాలూ భూమీ పరస్పరం కలిసి ఉండేవనీ, తరువాత మేము వాటిని వేరుచేశామనీ, ప్రాణం ఉన్న ప్రతిదానిని నీళ్ళతో సృష్టించామనీ. వారు (సృష్టించే మా శక్తిని) అంగీకరించరా? (దివ్యఖుర్ఆన్-21:30)**

- సమాప్తం -